

న్యాల్‌కల్ శివారులో కమ్ముకున్న పొగ మంచు

## కమ్ముకున్న పొగమంచు

**న్యాల్‌కల్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంతోపాటు హద్నూర్, గంగ్వార్, ముంగి, రుక్మాపూర్,, ఇబ్రహీంపూర్ తదితర గ్రామాల శివారు ప్రాంతాలు పొగ మంచుతో కమ్ముకున్నాయి. మంగళవారం తెల్లవారు జామునుంచి ఉదయం 7గంటల వరకు ఇంటి బయటకు వచ్చేందుకు, వాహనాలు రోడ్డపై నుంచి పోనిచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## కవితకు శుభాకాంక్షలు తెలిపిన కొట్టాల యాదగిరి

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 21 (ప్రభాతవార్త):** దీపావళి పండుగ సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మంగళవారం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాగృతి పటిష్టతలో భాగంగా వివిధ అంశాలపై కవితతో చర్చించినట్లు తెలిపారు.





అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు

**మెదక్ టౌన్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పోలీస్ అమరవీరుల దినోత్సవంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల స్మారక స్థూపానికి పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి మారుమూల ప్రాంతాలకు ప్రభుత్వ పథకాలను చేరవేయడంలో పోలీసుల పాత్ర కీలకం అన్నారు. మెదక్ జిల్లా 20 సంవత్సరాల క్రితం మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉన్నప్పుడు, 14 మంది పోలీసులు తమ ప్రాణాలను అర్పించి, ప్రజలు భయభ్రాంతం లేని జీవితం గడప డానికి మార్గం సుగమం చేశారని గుర్తుచేశారు. ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ, వారు చూపించిన త్యాగమార్గంలో మనం నడవాలని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలను కలుసుకుని, వారి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటుందని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ 191 మంది పేర్లను చదివి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డిఎస్‌పి ప్రసన్న కుమార్, తూప్రాన్ డిఎస్‌పి నరేందర్, సైబర్ క్రైమ్ డిఎస్‌పి సుభాష్‌చంద్రబోస్, ఏఆర్ డిఎస్‌పి రంగానాయక్, సీఐలు మహేష్, వెంకట రాజాగౌడ్, సందీప్‌రెడ్డి, రేణుకరెడ్డి, మధుసూదన్‌గౌడ్, జర్జ్, శైలందర్, రామకృష్ణ, ఎస్‌ఐలు సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

### సిద్దిపేట సిపి విజయ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



పోలీసు అమరవీరుల స్థూపంవద్ద నివాళులర్పిస్తున్న సీపీ విజయ్‌కుమార్

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని...ప్రజల రక్షణే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని సీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ అన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా మంగళవారం సీపీ కార్యాలయంలోని అమరవీరుల స్థూపానికి అడిషన్ డిసిపిలు అడ్మిన్ కుశల్కర్, సుభాష్‌చంద్రబోస్, జిల్లా పోలీసు అధికారులు, అమరవీరుల పోలీసు కుటుంబ సభ్యులతో కలిసి పూష్పగుచ్చాలువేసి ఘనంగా నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనంపాటించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ అమరులైన పోలీసు కుటుంబాలకు జిల్లా పోలీసు శాఖ, ప్రభుత్వ యంత్రాంగం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబాలతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎసిపిలు రవీందర్ రెడ్డి, నరసింహులు, సుమన్‌కుమార్, వివిధ విభాగాల సిఐలు కిరణ్, మొగిలి, శ్రీధర్‌గౌడ్, విష్ణుప్రసాద్, ధరణికుమార్, రాజేష్, కార్తీక్, వాసుదేవరావు, ఉపేందర్, ప్రవీణ్‌కుమార్ శ్రీను, లతీఫ్, రామకృష్ణ, మల్లేశం గౌడ్, విశ్రాంత పోలీసు అధికారులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలు మరువలేనివి : ఎస్‌ఐ

**వెల్దుర్తి, అక్టోబరు 21, ప్రభాతవార్త :** ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి అని ఎస్సై రాజు అన్నారు. మంగళవారం వెల్దుర్తిలోని పోలీస్ స్టేషన్లో పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని స్టేషన్ ఆవరణలో అమరుల పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. అమర పోలీసుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మోనం పాటించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్థానికేసే రాజు మాట్లాడుతూ దేశభక్తి కోసం పోలీసులు చేసిన త్యాగాలు మరువరాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్..

### విజేతలకు బహుమతులు అందచేసిన ఎమ్మెల్యే

**కంది, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇంద్రకరణ్ గ్రామ శివారులోని క్రికెట్ మైదానంలో కొనసాగిన అంబేద్కర్ క్రికెట్ టౌర్నమెంట్ మంగళవారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులు అందచేసి అభినందించారు. టోర్ని విజేతగా నిలిచిన ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన గేమ్ చేంజర్ జట్టుకు 33వేల రూపాయలతో పాటు ట్రోఫిని, రన్నర్‌గా నిలిచిన ఇంద్రకరణ్ గ్రామానికి చెంది అంబేద్కర్ టీంకు 22వేల రూపాయలను, ట్రోపిని అందచేశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, నాయకులు చింతాసాయినాథ్, నారాయణ, వెంకటేష్, శ్రీనివాస్, మహిపాల్, ఎస్ వెంకటేష్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.




విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

# పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబరు 21,ప్రభాతవార్త:** పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయమని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. పోలీసు అమరుల త్యాగాన్ని స్మరించుకుంటూ మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని పోలీస్ పరేడు గ్రౌండ్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.కలెక్టర్‌కు ఎస్పీ పంకజ్ పరితోష్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అమరవీరుల స్థూపానికి నివా ళులర్పించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ, వారి కుటుంబ సభ్యులతో వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పోలీస్ అమరవీరుల కుటుంబాల సభ్యులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భముగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ శాంతి భద్రతలలో పోలీస్ పాత్ర కీలకమన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించినవారిని స్మరిస్తూ ప్రతిసంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా(పోలీస్ ఫ్లాగ్ డే)గా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో ప్రత్యర్థులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన పోలీస్‌ల ధైర్యసాహసాలు, దేశభక్తిభావితరాలకు ఎంతో ఆదర్శమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మన జవాన్లు చేసిన, చేస్తున్న కృషి వెలకట్టలేనిదని చెప్పారు. అమరవీరుల కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా నేటి నుండి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన "జాతీయ ఐక్యత దినోత్సవం" అక్టోబర్ 31వ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్నిరకాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, శ్రీనివాసరావు, సంగారెడ్డి డిఎస్‌పి సత్యయ్యగౌడ్, జహీరాబాద్ డిఎస్‌పి సైదా నాయక్, పటాన్‌చెరు డిఎస్‌పి ప్రభాకర్, నారాయణఖేడ్ డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి నరేందర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్స్ కిరణ్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, జిల్లా ఇన్‌స్పెక్టర్లు,ఆర్‌ఐలు రామరావు, పరేడ్ కమాండర్లు రాజశేఖర్‌రెడ్డి, డానియెల్, అమరవీరుల కుటుంబ సభ్యులు హాజరై నివాళులర్పించడం జరిగింది.




పోలీసు అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/నంగునూర్/ అక్కన్నపేట, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** విధులు సక్రమంగా నిర్వహించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి హెచ్చరించారు. నారాయణరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందించే వైద్య సేవలను ఆరా తీశారు. హాజరు పట్టికను పరిశీలించి సంతకాలు చేసినా ఆసుపత్రిలో లేరని ఆరా తీశారు. మెడికల్ ఆఫీసర్ బాపురెడ్డి 12 గంటలకు, హెచ్‌ఈ పాండురంగాచారి 12.30కి వెళ్లారని, హెచ్‌ఎస్‌లు సునీతలక్ష్మీ, దేవిపల్లి, సుధారాణి రాఘవాపూర్‌లో ఫీల్డ్ విజిట్‌కు వెళ్లారని ఇతర సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. మెడికల్ ఆఫీసర్ హెచ్‌ఈ రెగ్యులర్‌గా వస్తున్నారా అని ఆరా తీయగా ఓపి, మూమెంట్ రిజిస్టర్ పరిశీలించగా ఎక్కువ రోజులు టూర్ వెళ్తున్నట్లుగా రిజిస్టర్ రాస్తూ విధులకు రాకుండా తప్పించుకోవడానికి టూర్ అని చెప్పి వెళ్తున్నారని గ్రహించిన కలెక్టర్ రిజిస్టర్‌లో కంప్లైంట్ రాసి మెడిలక్ ఆఫీసర్, హెచ్‌ఈపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్‌ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.



పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**నంగునూర్‌లో...**

నంగునూర్ మండలం పాలమాకుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో సందర్శించారు. మధ్యాహ్న భోజనంపై ఆరాతీయగా అన్నం, సొరకాయ టమాట కూర, పప్పుచారు చేసినట్లు విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజు కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థుల హాజరు ప్రకారం ఆహార పదార్థాలు కొలత ప్రకారం రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో ఫుడ్ చెకింగ్ టీచర్ రోజు మొత్తం ప్రక్రియను పర్యవేక్షణ చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలన్నారు.

**అక్కన్నపేటలో...**

అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తేమశాతం రాగానే గన్నిలలో నింపి లారీలలో లోడ్ చేయాలని సెంటర్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. తూకంలో ఎలాంటి తేడా రావద్దని సెంటర్ సిబ్బందికి సూచించారు. గన్ని బ్యాగులు ప్రతి రోజు చెక్ చేసుకోవాలని డ్యామేజ్ ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు ప్రక్రియ జరపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట

### సమస్యల పరిష్కారం : డిఇ బాషా

**నర్సాపూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** విద్యుత్ ప్రజాబాటతో సమస్యల పరిష్కారం అవుతాయని జిల్లా విద్యుత్ శాఖ డిఈ బాషా అన్నారు. మంగళవారం నర్సాపూర్ విద్యుత్ శాఖ ఏడిఈ రమణారెడ్డి ఆధ్వర్యంలో విధ్యుత్ ప్రజాబాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యుత్ శాఖ డిఈ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రజాబాటతో నేరుగా ప్రజల వద్దకే విద్యుత్ శాఖ సిబ్బంది వెళ్లి కాలనీలలో విద్యుత్ సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు సిబ్బంది పనిచేస్తారన్నారన్నారు.ఈ మేరకు నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకు వస్తే తక్షణమే విద్యుత్ సమస్యలను తీర్చేందుకు ప్రజా బాట కార్యక్రమాన్ని తీసుకొచ్చామని అన్నారు. ఈ ప్రజాబాటతో విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని జిల్లా విద్యుత్ శాఖ డి ఈ భాషా పేర్కొన్నారు. ఈ మేరకు ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఏఈ రామ్మూర్తి సబ్ ఇంజనీర్ క్రాంతి జనార్ధన్ నాగరాజ్ నవీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




ప్రజాబాటలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

# చిన్నశంకరంపేటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు కలేనా?

**చిన్నశంకరంపేట, అక్టోబరు 21,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట పట్టణం.. దినదినాభివృద్ధి చెందుతుంది...కాని డిగ్రీ కళాశాల ఏర్పాటు ఏళ్లతరబడి కలగానే మిగిలిపోయింది.ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో పేదవిద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా మిర్జాపల్లి, మడూర్, సూరారం, దర్పల్లి,చందంపేట, చిన్నశంకరంపేటలో జడ్పీ పాఠశాల, ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. పదవ తరగతి పూర్తి కాగానే విద్యార్థులు చిన్నశంకరంపేట పట్టణంలోని ఆదర్శ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యలో చేరుతున్నారు. ఇంటర్ విద్య పూర్తికాగానే డిగ్రీలో చేరుదామంటే మండలంలో కళాశాల లేకపోవడంతో ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరలో డిగ్రి కళాశాల లేకపోవడంతో కొందరు చదువుకు దూరం అవుతున్నారు. మరి కొంత మంది దూర విద్య డిగ్రీలో చేరుతున్నారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రి చదువాలంటే 25 కిలోమిటర్ల దూరంలోఉన్న మెదక్, రామాయంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లాల్సిందే. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లితండ్రులు కోరుతున్నారు.



చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

**రవాణా సౌకర్యం లేదు... ఇబ్బందులు తప్పడం లేదు...**

చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల నుండి మెదక్, రామాయంపేటకు డిగ్రీ చదువుకోవడానికి వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గజగట్లపల్లి, మడూర్, మాందాపూర్, మాందాపూర్ తండా, కొండాపూర్, గవ్వలపల్లి తండా, గవ్వలపల్లి, జంగరాయి, మల్లుపల్లి, రుద్రారం, కామారం, కామారం తండా తదితర గ్రామాల విద్యార్థులకు, ప్రయాణీకులకు బస్సు సౌకర్యం సరిగ్గా లేదు. దీంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయించి కళాశాలలకు,పాఠశాలలకు వెళ్తున్నారు. డిగ్రీ చదవడానికి దూరంతో పాటు, ప్రయాణ ఖర్చులు అధికమవుతున్నాయని విద్యార్థుల తల్లి దండ్రులు వాపోతున్నారు.

**డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి....**

**గణేష్ ఇంటర్ విద్యార్థి, గజగట్లపల్లి**

ఇంటర్ పూర్తిచేసి డిగ్రీ చదవాలంటే మెదక్, రామాయంపేటకు వెళ్లాల్సి వస్తుంది. రవాణా సౌకర్యం లేకపోవడంతో నలుగైదుగురం కలిసి ఆటో మాట్లాడుకొని కళాశాలలకు వస్తున్నాం. డిగ్రీ కళా శాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుంది.

**డిగ్రీ కళాశాలతో విద్యార్థులకు ఎంతో ఉపయోగం...**

ప్రతి సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలల నుండి ఇంటర్ విద్యార్థులు 200 మందికి పైగా వారి వారి కోర్సులను పూర్తి చేసుకొని వెళ్తున్నారు. రామాయంపేట, మెదక్‌లోని డిగ్రీ కళాశాల ఏర్పాటుకు జూనియర్ కళాశాల ఆవరణలో భవనం నిర్మాణలకు సరిపడా స్థలం ఉంది. ప్రభుత్వం చిన్నశంకరంపేటలో డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తే వందలాది మంది విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.



విడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు

## రైతులకు పంటలపై అవగాహన

**నర్సాపూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** పట్టణంలోని రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పప్పు ధాన్యాల పంటలు రైతులు తప్పకుండా వేసుకుని అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. అంతేగాక ప్రభుత్వం రైతులకు ధాన్యం పై గిట్టుబాటు ధర అందిస్తుందని అదేవిధంగా సబ్సిడీలు కూడా అందిస్తుందని అన్నారు. ఈ మేరకు రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు దీపిక, మోహన్. జిల్లా రైతు రక్షణ సమితి ముఖ్య సలహాదారులు మిరియాల చంద్రశేఖర్ గుప్త, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు జిల్లా మహాసభలు జయప్రదం

**సదాశివపేట, అక్టోబరు 21(ప్రభాతవార్త):** సదాశివపేటలో ఆదివారం నిర్వహించిన సిఐటియు సంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు జయప్రదంగా జరిగాయని ఈ మహాసభల్లో కార్మిక వర్గ సమస్యలపై అనేక తీర్మానాలు చేయడం జరిగిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానాలు చేయడం జరిగింది అన్నారు. పాలకవర్గాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పెట్టుబడుదాలకు అనుకూలంగా చట్టాలు తయారు చేస్తున్నారు అన్నారు. ఈ మహా సభలో జిల్లా నలుమూలల నుండి కార్మిక వర్గ ప్రతినిధులు పాల్గొనడం జరిగింది అన్నారు. భవిష్యత్తులో ఈ మహాసభల స్ఫూర్తితో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ మహాసభల్లో సదాశివపేట ప్రాంతం నుండి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రవీణ్ కుమార్ ,సిఐటియు జిల్లా కమిటీ సభ్యులుగా ఏ.నర్సింలు, నీలం మల్లేశంలను ఎన్నుకోవడం జరిగిందన్నారు.

## మండలంలో ఘనంగా దీపావళి సంబరాలు..

**వెల్దుర్తి, అక్టోబరు 21, ప్రభాతవార్త:** ఉమ్మడి మండల వ్యాప్తంగా సోమవారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం లక్ష్మి ్మ పూజలు నిర్వహించి టపాసులు పేల్చారు. అలాగే సాయంత్రం ఇలా వ్యాపార దుకాణాలలో మామిడి తోరణాలు. బంతి పూలతో. అలంకరించి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం టపాసులు పేరుస్తూ కేరింతలు కొట్టారు.

## గుండెపోటుతో బిఆర్‌ఎస్ నేత మృతి

**కంది, అక్టోబరు 21, ప్రభాతవార్త:** గుండెపోటుతో బిఆర్‌ఎస్ నేత, తెలంగాణ ఉద్యమకారులు ఉస్మాన్ అకాల మృతి చెందారు. సోమవారం ఇంట్లో ఉండగా అకస్మాత్తుగా ఛాతిలోనొప్పి రావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఉస్మాన్ మృతి చెందినట్లు తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, బిఆర్‌ఎస్ నాయకులు ఉస్మాన్ పార్థీవ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

**పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో మంజీర నదిలో దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఏడుపాయల్లో మంగళవారం వెలుగు చూసింది. పావన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు... రామాయంపేట మండలం కోమట్పల్లికి చెందిన రేణమ్మ(45) సోమవారం ఇంట్లో గొడవ పడి ఏడుపాయలకు వచ్చింది. మొదటి బ్రిడ్జి దగ్గర మంజీర నదిలో దూకింది. కాగా మంగళవారం సాయంత్రం నదిలో ఆమె మృతదేహం కనిపించడంతో, పోలీసులు ఆమె భర్త మల్లేష్‌కు సమాచారం అందించారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస గౌడ్ తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు సతీష్ ఉన్నాడు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**సిర్గాపూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కడ్పల్ తండా శివారులోని గంగారం కోళ్ల ఫాం వద్ద గుట్టు చప్పుడు కాకుండా జూదం ఆడుతున్న 10 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... 10 మంది కలిసి పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయంగా తెలుసుకుని జూదగృహంపై దాడి చేసి నగదును, పేకముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

**వైకుంఠధామంలో...**

**న్యాల్‌కల్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముర్తుజాపూర్‌లో వైకుంఠధామంలో జూదం ఆడుతున్న జూదగ్రస్థులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దోమ సుజిత్ తెలిపారు. ఎస్ఐ సుజిత్ దోమ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన అయిదుగురు వ్యక్తులు గ్రామంలోని వైకుంఠధామంలో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలసి దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి రూ.577 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ వివరించారు.

**తెల్లాపూర్‌లో...**

**రామచంద్రాపురం, అక్టోబరు 21, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిబ్లాక్‌లో పేకాట ఆడుతున్నవారిని పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. సోమవారం రాత్రి ఏడుగురు జూదరులు దయాకర్‌రెడ్డి, కృష్ణ, బీమలింగచారి, సాయిచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, ప్రశాంత్‌రెడ్డి పేకాట ఆడుతుండగా ఎస్‌ఓటి పోలీసులు అరెస్టు చేసి వారినుంచి 3లక్షల 36వేల 5వందల రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**పూడిగుమ్మల్‌లో...**

**జహీరాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** కోహీర్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దీపావళిని పురస్కరించుకుని జూదం ఆడుతన్న జూదగ్రస్థులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... మండల పరిధిలోని సజ్జాపూర్‌లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తుల నుంచి 2310 రూపాయలను, పైడిగుమ్మల్ గ్రామంలో రెండు చోట్ల జూదం ఆగుతున్న 9 మంది నుంచి 5680 రూపాయలను, మనియార్‌పల్లిలో దుకాణ సముదాయం ముందు జూదం ఆడుతున్న 4 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకుని పేకాట రాయుళ్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ వివరించారు.

## సదర్‌కు హాజరుకావల్సిందిగా మాజీ మంత్రులకు ఆహ్వానం


సదర్‌కు హరీష్‌రావును ఆహ్వానిస్తున్న ఎడ్ల హరిబాబు యాదవ్

**ముషీరాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త:** ఈనెల 22న నారాయణ గూడలో జరగనున్న సదర్‌కు హాజరుకావల్సిందిగా మాజీ మంత్రులు హరీష్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను తెలంగాణ రాష్ట్ర సదర్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర సదర్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలసి ఉపాధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎడ్ల హరిబాబు యాదవ్ మాజీ మంత్రుల నివాసాలకు వెళ్లి ఆహ్వాన పత్రికలు అందచేశారు. ఎంతో అంగరంగ వైభవంగా యాదవ సోదరులు నిర్వహించే సదర్‌కు తప్పకుండా హాజరవుతామని వారు హామీ ఇచ్చారు.

## పరికె చెరువు కబ్జాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**-కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి విజ్ఞప్తి**


పరికె చెరువును పరిశీలిస్తున్న హన్మంత్‌రెడ్డి

**జగద్గిరిగుట్ట, అక్టోబర్ 21, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126వ డివిజన్ జగద్గిరిగుట్ట పరిధిలోని భూదేవి హిల్స్‌లో ఉన్న పరికె చెరువు కబ్జాలకు గురవుతున్న నేపథ్యంలో మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి భూదేవి హిల్స్‌ను సందర్శించి, చెరువును కబ్జా చేసే వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, హైడ్రా కమిషనర్‌ని కోరారు. అలాగే, చెరువు చుట్టూ కంచ వేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, రషీద్, కృష్ణ గౌడ్, లక్ష్మ రెడ్డి, గోరె భాయ్, నరేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ చంద్రయ్య, బేకు శ్రీనివాస్, పందరి, సోమన్నా శ్రీధర్ రెడ్డి, ఎం.డి. జాకీర్, సంతోష్, ఎం.డి. లాయక్, పెరిక శివ, భరత్ గౌడ్, వేణు గౌడ్, పిల్లి ఆంజనేయులు, మహిళా నాయకులు కౌసల్య, అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విహెచ్ నివాసంలో నేడు సత్యనారాయణ వ్రతం


విహెచ్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న తొలుపునూరి కృష్ణగౌడ్, చిత్రంలో ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నారాయణస్వామి, దిడ్డి రాంబాబు, గరిగంటి రమేష్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 21 ప్రభాతవార్త:**

మాజీ పిసిసి అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు అంబర్‌పేటలోని తన నివాసంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం 7 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. కాగా, దీపావళి పండుగ సందర్భంగా వి.హనుమంతరావును కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు నారాయణస్వామి, దిడ్డి రాంబాబు, గరిగంటి రమేష్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పంజాల వెంకటేష్ గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, శ్రీమంత్ గిరి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై విజయం సాధించిన సందర్భంగా దీపావళి జరుపుకోవడం జరుగుతుందని, త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఎన్నికలలో కూడా చెడుపై విజయం సాధిస్తుందని ఈ సందర్భంగా విహెచ్ జోస్యం చెప్పారు.

## చందానగర్‌లో పగిలిన మంజీరా పైప్‌లైన్

### వృధాగా పోతున్న తాగునీరు


చందానగర్ శ్వేతాగార్డెన్ వద్ద పగిలిపోయిన మంజీరాపైప్‌లైన్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని చందానగర్‌లో మంజీరాపైపలైన్ పగిలి మంచినీరు ఎగసిప్రవహించింది. మంజీరాపైప్‌లైన్ గేట్‌వాల్ వద్ద లీకేజీతో మంచినీరు దాదాపు 15మీటర్ల ఎత్తులో ఎగిసి పడింది. దీనికి పైనే విధ్యుత్ వైర్లు ఉండటంతో స్తానికులు భయాందోళనకు గురయ్యారు. చందానగర్ పరిధిలోని శ్వేతాగార్డెన్ సమీపంలో మంజీరా నీటి పైప్‌లైన్లలో తరచూ ఇలాంటి లీకేజీలు ఏర్పటం సహజంగా మారింది. నగరానికి మంజీరానీటిని అందించేందుకు నిర్మించిన ఈ పైప్‌లైన్ పగలటంతో వేలగ్యాలల్ల తాగునీరు వృధాగా రోడ్డుపై ప్రవహించింది. ఈ పైప్‌లైన్ పగిలిపోవడంతో అటువైపుగా రాకపోకలను నిలిపివేశారు. అధికారులు రంగప్రవేశం చేసి పగిలిపోయిన మంజీరాపైప్‌లైన్‌ను మరామ్మత్తు చేసేందుకు సిద్దమయ్యారు. కాగా గతంలో కూడా శ్వేతాగార్డెన్ సమీపంలో మంజీరా పైప్‌లైన్లు పగిలిపోవడం, తాగునీరు వృదాకావడం పరిపాటిగా మారుతుందని, అధికారులు చర్యలు తీసుకోవాలనిస్థానికులు కోరుతున్నారు.

## తలసాని నివాసంలో దీపావళి వేడుకలు


దీపావళి వేడుకల్లో పాల్గొన్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

**జూబ్లీహిల్స్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో సోమవారం రాత్రి దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన కుమారుడు తలసాని సాయికిరణ్‌యాదవ్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. మనువడితో కలిసి టపాసులు పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు.

# నయా నరకాసురుడు రేవంత్‌రెడ్డి : హరీష్‌రావు

**- మూసీ సుందరీకరణ పేరుతో పేదలను భయబ్రాంతులకు గురి చేస్తుండు**
**- రేవంత్ వచ్చాక తెలంగాణలో రియల్ వ్యాపారం కుదేలైంది**
**- పేదలకు ఆపదల్లో, ఆనందాల్లో బిఆర్ఎస్ అండ**


హైదర్షాకోట్‌లోని మూసీ పరివాహక ప్రజల మధ్య దీపావళి వేడుకలు జరుపుకొని, మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావ్.

**నార్సింగి, అక్టోబర్ 21 ప్రభాతవార్త :** నయా నరకాసూరుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలన విరుగడ అయిన రోజే తెలంగాణ ప్రజలకు నిజమైన దీపావళి పండగ వస్తుందని మాజీ మంత్రి టి.హరీష్‌రావ్ పేర్కొన్నారు. గండిపేట మండలం హైదర్షాకోట్‌లో మూసీ పరివాహక ప్రజలు, నిరుపేదల మధ్య కార్తిక్‌రెడ్డితో కలిసి దీపావళి పండగను హరీష్‌రావ్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేద పిల్లలకు బాణాసంచాను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా వేదిక పైనుంచి హరీష్‌రావ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై పదునైన విమర్శలు చేశారు. నాడు ప్రజాకంటకులను తుదముట్టించిన తరువాత ప్రజలు దీపావళిని జరుపుకున్నారని, నేడు తెలంగాణలో నయా నరకాసూరుడు రేవంత్ పాలన విరుగడ పొందిన రోజునే అసలైన దీపావళిని ప్రజలు జరుపుకుంటారన్నారు. కేసీఆర్ హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లను కట్టించాడని, లక్షలాది మందికి 58,59.జీవోల కింద పట్టాలు పంపిణీ చేశారని వివరించారు. రేవంత్‌రెడ్డి రెండేళ్ల పానలో లక్ష ఇళ్లను కూల్చాడని, ఒక్క ఇల్లును కూడా కట్టలేదని ఆరోపించారు.

హైడ్రా పేరుతో పేద ప్రజలను భయబ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని హితవు పలికారు. పేదలు, ఉద్యోగులు పైసా పైపా కూడబెట్టుకొని ఇళ్లు కట్టుకుంటే నేడు మూసీ సుందరీకరణ పేరుతో వాటిని కూలుస్తామంటూ మార్కింగ్ వేయడం దారుణమన్నారు. పేదలకు అండగా బిఆర్ఎస్ ఉందని, ప్రజల తరఫున ఉద్యమించి, కోర్టుల్లో కేసులు వేశామని వివరించారు.

నాడు ఆపదలో మీ హైదర్షాకోట్‌కు వచ్చామని, ఇప్పుడు ఆనందం వేళలో కూడా మీతో గడుపాలని ఇక్కడికి వచ్చామన్నారు. సీఎం సోదరుడికి, పొంగులేటి, మహేందర్‌రెడ్డిల వద్దకు ఎందుకు హైడ్రా వెళ్లడం లేదని, దీన్ని బట్టే హైడ్రా ఎంత పక్షపాతంతో పని చేస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు.

నాడు సీఎం కేసీఆర్ కాళేశ్వరంను కట్టి, మల్లన్న సాగర్ మీదుగా మూసీకి గోదావరి నీటిని తరలించి స్వచ్ఛమైన నీటిని హైదరాబాద్‌లో పారించే ప్రణాళికలు రూపొందించారన్నారు. నేడు రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ పేరుతో పేదలను భయబ్రాంతులకు గురి చేస్తూ, వారికి కంటిమీద కునుకు పోనివ్వడం లేదన్నారు. బడా పారిశ్రామక వేత్తల కోసం పేదల ఇళ్లను కూల్చడం మానుకోవాలని, ఖాళీ స్థలాలల్లో మాత్రమే సుందరీకరణ పనులు చేయాలని, పేదల ఇళ్ల జోలికి వస్తే బీఆర్ఎస్ అడ్డుకొని తీరుతుందన్నారు. జూబ్లీహిల్స్‌లో చాలా మంది మీ స్నేహితులు, బంధువులు, తెలిసిన వారుంటారని మీరు అక్కడికెళ్లి బీఆర్ఎస్‌కు ఓటు వేయించాలని కోరారు. అప్పుడు ఈ ప్రజా వ్యతిరేక సర్కారుకు బుద్ధి వస్తుందని, ఒళ్లు దగ్గర పెట్టుకొని పని చేస్తుందని హరీష్‌రావ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, నాయకులు ముక్తార్ పాషా, తలారి పాండు, రాముడు, వెంకటేష్, శాంతి నాయక్ పాల్గొన్నారు.

## పాటకు అభిమానులు కాని వారు ఉండరు : డాక్టర్ నరసింహా రెడ్డి


డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డిలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి అక్టోబర్ 21 ప్రభాతవార్త:** ఎట్టి పాట ఇనా ప్రతి వారి మనసుకు తాకుతుంది అని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు పాటకు అభిమానులు కాని వారు ఎవరూ ఉండరు అని చెప్పారు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో మల్లెల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏనుగు నరసింహా రెడ్డి కి ప్రముఖ గాయకుడు ప్రసాద్ కొమ్మరాజు కు ఆత్మీయ సత్కారం జరిగింది ఈ సందర్భంగా ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ సత్కారం కన్నా నేను రాసిన కవితలు వేదిక పై ఎవరైనా ప్రస్తావన చేస్తే అదే నాకు గొప్ప సన్మానం అని భావిస్తాను అన్నారు సత్కారం చేసిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి కి మల్లెల సంస్థ వసుంధరకు ధన్య వాదాలు తెలిపారు అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహా సభలు విజయవంతం కావటం లో నరసింహా రెడ్డి కృషి విస్మరించలేము అన్నారు మంచి కవి మాత్రమే కాదు విషయం పూర్తి అవగాహన తో ప్రసంగించ కల వక్త అన్నారు వేదిక పై గాయకుడు ప్రసాద్ కొమ్మరాజు (అమెరికా) ను సంస్థ పక్షాన ఆత్మీయ సత్కారం చేశారు వేదిక పై అణు శాస్త్ర వేత్త విశ్వనాధ్ కళాభిమాని వినోద్ గాయని కమలాశాస్త్రి, శరత్ కృష్ణ తదితరులు పాల్గొనగా కళ్యాణ్ వ్యాఖ్యానం లో శరత్ కృష్ణ నాగ భూషణం కృష్ణ మోహన్ పద్మ అనురాధ జ్యోతి శ్రీదేవి అపర్ణ తదితరులు మధురమైన పాటలు పాడారు సంస్థ అధ్యక్షులు మల్లెల వసుంధర స్వాగతం పలికారు.

## నేటి నుండి ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలు


వివరాలు వెల్లడిస్తున్న వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈఓ. మాచర్ల దేవనాథం

**చిక్కడపల్లి అక్టోబర్ 21 ప్రభాతవార్త:** వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలను వైభవంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈఓ. మాచర్ల దేవనాథం వివరించారు. బుధవారం నుండి నవంబర్ 20 వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని. ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, ప్రతి రోజు సాయంత్రం ఆరున్నర గంటలకు ఆకాశ దీపోత్సవం, ప్రతి సోమవారం ఉదయం పది గంటలకు ఏకవార రుద్రాభిషేకాలు, ప్రతి గురువారం అన్నాభిషేకం, ప్రతి రోజు సోమవారం సాయంత్రం ఏడు గంటలకు ప్రదోషకాలపూజ ఉంటాయన్నారు. నవంబర్ రెండవ తేదీన, తులసి కృష్ణ కళ్యాణం, అయిదవ తేదీన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, పదిహేనవ తేదీన జ్వాలాతోరణం, పద్దెనిమిదవ తేదీన మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం ఏడు గంటలకు శివపార్వతుల కళ్యాణం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయం ముఖ్య అర్చకులు బుగ్గాలక్ష్మీపతి శర్మ, అర్చకులు కందాళ వేంకటాద్రి, ఆలయం కమిటీ సభ్యులు జి. పద్మావతి, నిర్మల, ముక్క రామకృష్ణ, గండి హరీష్, నెల్లి శ్యాం కుమార్ ముదిరాజ్, నేత రాణి, ఎం. లక్ష్మీనారాయణ రావు, కంది సుబ్బారావు, అమర బాలా కుమార్, దాసరి నవీన్ ప్రసాద్, వెన్నెలకంటి వెంకట శిశు కుమార్, కొత్తూరి వెంకట ప్రతాప్ కుమార్, తెలగంశెట్టి లోకనాథ్, మురికి గణేష్, ఎం.బి. రామకోటేశ్వర్ రావు, ఓరుగంటి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పాలనలో బస్తీ దవాఖానాలకు సుస్తీ : మాజీ మంత్రి హరీశ్‌రావు


లింగంపల్లి బస్తీ దవాఖానాను పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానాల పరిస్థితి ఘోరంగా మారిందని తెలంగాణ రాష్ట్ర మాజీ ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని బస్తీదవాఖానను మాజీ మంత్రి హరీశ్‌రావు సందర్శించారు. బస్తీ దవాఖానాలో వైద్యవసతులపై రోగులను ఆరాతీశారు. దవఖానా సిబ్బందిని కలుసుకుని వారితో బస్తీ ఆసుపత్రులు నడుస్తున్న తీరుతెన్నులపై వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పేద ప్రజలకు వైద్య,ఆరోగ్య సేవలను అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ముందుచూపుతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు కేంద్రప్రభుత్వ గుర్తింపును పొందినవని ఆయన అన్నారు. నగరంలో దాదాపు 4500 బస్తీ దవాఖానాలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేయటం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక బస్తీ దవాఖానాలకు సుస్తి పట్టిందన్నారు. గత ఆరునెలలుగా బస్తీ దవాఖానాలలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ప్రతినెల జీతాలు ఇస్తున్నామని చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం ఆసుపత్రులల్లో బీ12, హార్ట్‌కు సంబందించిన మెడిసన్స్, అత్యవసర మందులేవీ అందుబాటులో లేవని, వైద్య పరీక్షలు లేవని ఆయన అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బస్తీ దవాఖానాలను సక్రమంగా ఆర్గనైజ్ చేయకపోవడం విచారకమన్నారు. ఆరోగ్య శ్రీ బకాయిలు విడుదల కావడంలేదని, గతంలో తమ హాయాంలో పదివేల కోట్లను విడుదల చేసి ఆరోగ్యశ్రీకి కేటాయించటం జరిగిందన్నారు. ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ వంటి స్కీమ్‌లు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని, జర్నలిస్టులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్‌కార్డులు పనికిరాకుండా పోతున్నాయన్నారు. నిరుపేద ప్రజలకు వైద్య,ఆరోగ్య సేవలను అందించటంలో కాంగ్రెస్‌ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాదవరం రంగారావు, వి. ఆదర్శ్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిసెంబరు 5,6 తేదీలలో 'గోబల్ టిపిఓ అండ్ హెచ్ఆర్ సమ్మిట్-2025'


బ్రోచర్‌ను ఆవిష్కరించిన జయరాం

**సైఫాబాద్, అక్టోబరు 21 ప్రభాతవార్త:**

విద్యార్థులకు నైపుణ్యత, ఉద్యోగాల కల్పన అనే అంశాలపై చర్చించేందుకు డిసెంబరు 5, 6 తేదీలలో గచ్చిభౌలిలోని 'గ్లోబల్ టిపిఓ అండ్ హెచ్ఆర్ సమ్మిట్-2025'ను గచ్చిభౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పటల్స్ మేనేజ్‌మెంట్‌లో నిర్వహిస్తున్నామని తెలంగాణ అండ్ టిపిఓ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ జయరాం తెలిపారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని, అందులో భాగంగానే ఈ సమ్మిట్ ఈ డిసెంబరు 5వ తేదీన నిర్వహిస్తున్నామని, ఇందులో పలు దేశాలు, మన దేశంలోని 24 రాష్ట్రాల ప్రతినిధులు, హెచ్ఆర్‌లు హాజరవుతారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా నిపుణులు విద్యార్థులకు, ప్రతిభ, సాంకేతిక, పారిశ్రామిక, పర్యాటక అంశాలపై సలహాలు, సూచనలు అందిస్తారని, 6న అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రొఫెసర్ దేవిశ్రీప్రసాద్, ప్రశాంత్, సతీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసంగమేశ్వర దేవాలయంలో నేత్రపర్వంగా కార్తీకమాస మహోత్సవాలు

**-ఆకాశ దీపారాధనతో అంకురార్పణ**

**నాంపల్లి, అక్టోబరు 21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురస్కార శైవక్షేత్రం శ్రీసంగమేశ్వర, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నవంబర్ 20 గురువారం జరిగే కార్తీకమాస మహోత్సవాలు మంగళవారం రాత్రి 6.30 గంటలకు భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపారాధనతో అంకురార్పణ నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి, ఛైర్మన్ బి.సి.వెంకటేశ్వరరావులు కార్తీకమాస మహోత్సవ ప్రత్యేక పూజాకార్యాక్రమాల వివరాలు వెల్లడించారు. 25 శనివారం నాగులచవితి; 26 ఆదివారం ఉ.9గంటలకు విభూత్యాభిషేకం; 27 మొదటి కార్తీక సోమవారం ఉదయం 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; నవంబరు 1 శనివారం ఉదయం 9.30లకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతము; 2 ఆదివారం ఉదయం 9.30లకు శతచ్ఛిద్ర రుద్రాభిషేకము; రాత్రి 6.30లకు తులసీ కళ్యాణం, అల్పాహారం; 3 సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 5 బుధవారం కార్తీకపౌర్ణమి సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, రాత్రి 7.00లకు జ్యాలాతోరణం (సంకల్పం), పుష్పాలంకరణ; 9 ఆదివారం ఆరుద్రనక్షత్రం ఉదయం 9.00లకు రుద్రహోమం, 12లకు వనభోజనములు; 10 సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 15 శనివారం సాయంత్రం 5లకు లక్ష బిల్వార్చన; 16 ఆదివారం ఉదయం 9లకు అన్నాభిషేకము; 17 చివరి సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 16 మంగళవారం మాసశివరాత్రి ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేకం, ఉదయం 7.30-9-10.30లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు, రాత్రి 6.30లకు శివకళ్యాణ మహోత్సవం, అల్పాహారం; 20 గురువారం ఉదయం 9లకు సప్తవింశతి కలశాభిషేకము పూజాకార్యక్రమాలుంటాయని అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాది కార్యక్రమాల్లో పాల్గొని ఆ పరమశివుని అనుగ్రహ పాత్రులు కావాలని పి.లక్ష్మారెడ్డి, బి.సి.వెంకటేశ్వరరావు, అర్చకులు కోరారు.

# నార్సింగిలో వైభవంగా 'సదర్' వేడుకలు

**- ఆడి,పాడిన సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి**


నార్సింగి సదర్ వేడుకలలో డప్పుల దర్వుకు అనుగుణంగా స్టెప్పులు వేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృశ్యం

**నార్సింగి, అక్టోబర్ 21 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగి గ్రామంలో వెలుగుల పండుగ దీపావళి రోజు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జి.వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన "సదర్" వేడుకలు వైభవంగా సాగాయి. పదుల సంఖ్యలో ప్రత్యేక శిక్షణ పొందిన దున్నలను హర్యానా, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకు వచ్చి అందంగా అలంకరించి, పూజలు చేసి, భారీ ఊరేగింపు నిర్వహించారు. దున్నలను ముందుకాళ్లు పైకి ఎత్తించి నృత్యాలు చేయించారు. ఊరేగింపులో జై యాదవ్... జైజై మాదవ్... అంటూ యాదవ సోదరులు నినదించారు. ఈ వేడుకలకు రాజేంద్రనగర్ శాసన సభ్యులు టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి యాదవ సోదరులు, యువకులను ఉర్రూతలూగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డి సైతం సదర్ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొని దప్పుల దరువుకు అనుగుణంగా యువకులతో పోటీ పడి నృత్యాలు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంతోషానందాలలో మునిగితేలారు. గత 15.సంవత్సరాలుగా నార్సింగిలో సదర్ వేడుకలను వెంకటేష్ యాదవ్ ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. అలాగే కోకాపేట్‌లో చిక్కిరి బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో సదర్ వేడుకలను అంగరంగవైభవంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు సూర్యప్రకాశ్, మాజీ కౌన్సిలర్ అరుణజ్యోతి, కాంగ్రెస్ నాయకులు దశరత్ యాదవ్, హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## గంగానగర్ బస్తీ దవాఖానను సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


గోల్నాక డివిజన్ గంగానగర్ బస్తీ దవాఖానను సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్ అక్టోబర్ 21 ప్రభాతవార్త:**

అంబర్‌పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం గోల్నాక డివిజన్ గంగానగర్ బస్తీ దవాఖానను సందర్శించారు. గత (బిఆర్ఎస్) ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బస్తీ దవాఖానల పథకంను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా నిరక్ష్యం వహించడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం డాక్టర్లు , సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించకపోవడం, అలాగే మందులు, ల్యాబ్ టెస్టులు మరియు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడంలో వైఫల్యం చెందడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు సమయానికి మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోరారు. పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# సదర్ ..అదిరెన్






**హైదరాబాద్, అక్టోబరు 21 ప్రభాతవార్త**

దున్నపోతుల విన్యాసాలు..డప్పు చప్పుళ్లు, నృత్యాలు, ఆటపాటలతో దీపావళి సదర్ వేడుకల్ని సంబరంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లో మంగళవారం నవయుగ యాదవ సంఘం చౌదరి యాదయ్య యాదవ్ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలు వైభవంగా సాగాయి. అందంగా అలంకరించిన దున్నపోతులపై యాదవుల హాకీ స్టిక్‌లు పట్టుకొని నృత్యాలు చేస్తూ, తీన్మాన్ స్టెప్పులు వేశారు. దాదాపు నాలుగైదు గంటలపాటు వాటి విన్యాసాలు వీక్షకులను అలరించాయి. సదర్ ఉత్సవాల్లో ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాల్గొన్నారు.


బంజారా హిల్స్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## రాజేంద్రనగర్‌లో ట్రాఫిక్ పరిస్థితిపై ఏసిపి పర్యవేక్షణ

**అత్తాపూర్ అక్టోబరు21,ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పరిస్థితులను అధికారులు పర్యవేక్షించారు. ట్రాఫిక్ ఏసీపీ స్వయంగా ఆరంఘర్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ సాధారణంగా కొనసాగుతుండగా, పీక్ అవర్స్‌లో కూడా సమర్థవంతంగా నియంత్రణ చేపట్టాలన్నారు. ప్రయాణికులు లేన్ డిసిప్లిన్ పాటించి, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మామిడాకులు కోసేందుకు వెళ్లి కింద పడి వ్యక్తి మృతి

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :**

దీపావళి పండుగ సందర్భంగా మామిడి ఆకులు కోసేందుకు వెళ్లి ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ఆనంద్‌నగర్ కాలనీలో నివసించే నాసోల్ల నరసింహా(50) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. దీపావళి సందర్భంగా ఆదివారం ఉదయం మామిడి ఆకులు కోసేందుకు తన ఇంటి మూడో అంతస్తుకు వెళ్లి మామిడి ఆకులు తెంపుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య దుర్గ ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భర్తతో గొడవపడి భార్య ఉరివేసుకుని ఆత్మహత్య

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :**

భర్తతో గొడవపడి ఒక మహిళ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌కు చెందిన ఉపేంద్ర భార్య స్వప్న(27)లకు తొమ్మిది సంవత్సరాల క్రితం పెళ్లి జరిగింది. అయితే గత కొద్ది రోజులుగా భార్యభర్తల మధ్య కుటుంబ సమస్యలు ఉన్నాయి. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి 1.30 గంటల సమయంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వెంటనే భర్త చూసి ఆసుపత్రికి తీసుకుని వెళ్లే లోగా ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి సోదరులు వినోద్‌చారి ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :**

అర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ గణేష్‌నగర్‌కు చెందిన మట్టెవాడ మురళీమోహన్(47) ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అయితే గత కొద్ది రోజులుగా ఆయన భార్య ఆరోగ్య బాగలేక ఇబ్బంది పడుతున్నాడు. ఇదే క్రమంలో అర్థిక సమస్యలు కూడా ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈనెల 19వ తేదిన ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. అర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతోనే అత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడు ఆత్మహత్య

**అత్తాపూర్ అక్టోబరు21,ప్రభాతవార్త :**

ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం....అత్తాపూర్ పరిధిలోని పాండురంగ నగర్‌లో నివాసం ఉండే సంజయ్ కుమార్ (23) ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సమాచారం రావడంతో ఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించడం జరిగిందని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ర్యాంప్‌లో ట్రాఫిక్ నియంత్రణ..

**అత్తాపూర్ అక్టోబరు21,ప్రభాతవార్త :**

శివరాంపల్లి ర్యాంప్‌లో వాహనాల గమనాన్ని సమగ్రంగా ట్రాఫిక్ పోలీసులు పరిశీలించారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే ఆరాంఘర్ వైపు డౌన్ ర్యాంప్‌లో రియల్‌టైమ్ ట్రాఫిక్ డేటా సేకరించి, వాహనాల ప్రవాహాన్ని అంచనా వేశారు. ఆరాంఘర్ జంక్షన్‌లో రైట్ టర్న్, యూటర్న్ వాహనాల సంఖ్య, అండర్ పాస్ వినియోగం, శంషాబాద్ వైపు రైట్ టర్న్, బహదూర్‌పురా వైపు లెఫ్ట్ టర్న్ వాహనాల గణన చేశారు. ట్రాఫిక్ సజావుగా వెళ్లేందుకు సర్వే చేశారు.


కృత్రిమ ఇసుక తయారీకి తీసిన గుంతలు

## యథేచ్ఛగా కృత్రిమ ఇసుక తయారీ, రవాణా

### నిద్రావస్థలో అధికార యంత్రాంగం

**హత్నూర అక్టోబరు 21, ప్రభాతవార్త:** పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపం నిరక్ష్యంతో హత్నూర మండలం దౌలాపూర్ గ్రామంలో అక్రమ కృత్రిమ ఇసుక తయారీ, రవాణా యదేచ్చగా జరుగుతుందని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. కృత్రిమ ఇసుక తయారీ రవాణా నిషేధం ఉన్నప్పటికీ దౌలాపూర్ గ్రామం పరిధిలో ఇసుక తయారు చేసి రాత్రిపూట వాహనాలలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు. . గ్రామపంచాయతీ ( జి పి ఓ )అధికారులు నియమాకము జరిగినప్పటికీ ఈ అక్రమ తయారీ రవాణా ఆగడం లేదని వారు విమర్శిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా తగు చర్యలు తీసుకొని అక్రమంగా కృత్రిమ ఇసుక తయారీ రవాణాలను అడ్డుకోవాలని స్థానికులు పలువురు కోరుతున్నారు. ఈ విషయమై హత్నూర తాసిల్దార్ ఫర్వీన్ షేక్ ను వివరణ కోరగా అక్రమ ఇసుక తయారీ రవాణా విషయం తన దృష్టికి రాలేదని అక్రమ ఇసుక తయారీ రవాణాను అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ స్పష్టం చేశారు.

## భూభారతి సమస్యలు పరిష్కరించాలి

### తహసీల్దార్ ఫర్వీన్ షేక్


మాట్లాడుతున్న తహసిల్దార్ ఫర్వీన్ షేక్

**హత్నూర అక్టోబర్ 21, ప్రభాతవార్త :** భూభారతి గ్రామసభల సందర్భంగా వచ్చిన దరఖాస్తులను క్రమబద్ధతిలో పరిష్కరించేందుకు జిపిఓలు తగిన శ్రద్ధ చూపాలని తహసీల్దార్ ఫర్వీన్‌షేక్ అన్నారు మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో జిపిఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూభారతి గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను గ్రామంలో విచారణ, స్థల పరిశీలనలు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కారానికి కృషి చేయాలని జిపిఓలకు ఫర్వీన్ షేక్ సూచించారు. హత్నూర మండలంలోని వివిధ గ్రామాలలో అక్రమ ఇసుక రవాణా గురించి ఫిర్యాదులు చాలా వస్తున్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, వాహనాలను స్వాధీనం చేసుకొని అవసరమైతే పోలీస్ కేసులు నమోదు చేయాలని, ఆమె జిపిఓ లకు సూచించారు. తమ గ్రామాల పరిధిలో జరుగుతున్న ప్రతి విషయాలపై ఎప్పటికప్పుడు దృష్టి పెడుతూ ఉండాలని సలహా ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ దావూద్ పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు


పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

**చేర్యాల, అక్టోబరు 21, ప్రభాతవార్త :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా చేర్యాల పోలీసులు స్టేషన్ నుండి పట్టణంలోని హనుమాన్ దేవాలయం పక్కన ఉన్న పోలీస్ అమరవీరుల స్థూపం వద్దకు ర్యాలీగా పెద్ద ఎత్తున తరలివెళ్ళి స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీను, ఎస్సై నవీన్, ఎఎస్సై నవీన్, కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న సిపి


సీపీ విజయ్‌కుమార్‌కు స్వామి వారి చిత్ర పటం అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, అక్టోబరు 21, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామిని సిద్దిపేట జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.ఎం.విజయ్‌కుమార్ సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఆధ్వర్యంలో అర్చకులు ఘనస్వాగతం పలికారు. అర్చకులు వేద విద్యార్థులు ఆశీర్వచనము, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా సీపీ ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, చేర్యాల సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రాజు తదితరులు ఉన్నారు.

## శాశ్వత ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**కొండపాక, అక్టోబరు 21, ప్రభాతవార్త :** శాశ్వత ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వెలికట్ట గ్రామ రైతులు తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల అధ్యక్షుడు అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ వెలికట్ట గ్రామం పక్కనున్న ఊరచెరువు శిఖం భూమిలో ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించి రైతులకు ఉపయోగపడేవిధంగా శాశ్వత ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. చెరువు పక్కన ఉన్న కోనోకార్పస్ చెట్లపై పక్షులు చేరి గూళ్లుకట్టడంతో దర్వాసన వస్తుందని దాంతో గ్రామస్తులు రోగాల బారినపడుతున్నరని వాపోయారు. అంతే కాకుండా మిగిలిన స్థలంలో పార్కును ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పెరుగు చంద్రం, ఎర్రబోయిన కనకయ్య, పెరుగు బాల్‌నర్సయ్య, బండి రాజు, బర్మ కొమురయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు శాశ్వత ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం వినతి పత్రం అందిస్తున్న రైతులు

# నూనె గింజలు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి


సబ్సిడీ పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**అక్కన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త :** జిల్లాలో నూనె గింజల సాగును పెంపొందించడానికి వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు కొన్ని ప్రాంతాలు గుర్తించారని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. జాతీయ నూనె గింజల పథకం(ఎన్ఎంఈఓ-ఓఎస్) పొద్దుతిరుగుడు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 100 శాతం సబ్సిడీతో 253 మంది రైతులకు 500 ఎకరాలు సాగు చేసేందుకు పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రాంతం పొద్దుతిరుగుడుకు అనుకూల వాతావరణంగా భావించి ఎంపిక చేశారని తెలిపారు. ఒకటే వరి సాగు చేయడం ద్వారా భూమిలో సారం తగ్గుతుందని రైతులు పంట మార్పిడి చేయాలన్నారు. నూనె గింజలను వేరే దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని.. మన రైతులు ఇక్కడే పండిస్తే మనమే ఎగుమతి చేసేలా రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మన ప్రాంతాల్లో వాతావరణం పొద్దుతిరుగుడుకు అనుకూలంగా ఉండడంతో ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు. పొద్దుతిరుగుడు పంటలో ఎలాంటి సందేహాలు ఉన్నట్లయితే ప్రసిద్ద ఎఫ్‌పిఓను సంప్రదిస్తే అన్ని నివృత్తి చేస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కె.లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఎఎంసి చైర్మన్, వ్యవసాయ అధికారులు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు సబ్సిడిపై విత్తనాలను అందజేస్తున్న దృశ్యం

## నూనె గింజల పంటల సాగుతో అధిక లాభాలు

**రాయపోల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :** రైతులు నూనె గింజల పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని గజ్వేల్ ఏడిఏ బాబునాయక్, రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన రైతులకు సబ్సిడీ కింద పొద్దుతిరుగుడు, శనిగలు, మొక్కజొన్న విత్తనాలను అందజేసారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ..జాతీయ నూనె గింజల పథకంలో భాగంగా పొద్దు తిరుగుడు రకం తిల్హన్ టెక్.స్.యు.న్ హెచ్-1, 2.20 కేజీల విత్తనాలు సబ్సిడీ పోను 85.20 రూపాయలు అని, అదే విధంగా జాతీయ ఆహార భద్రత పోషణ మిషన్ 2025లో భాగంగా న్.బి.ఇ.జి47 శనిగ విత్తనాలు, సి.టి 4260 మొక్కజొన్న విత్తనాలు సబ్సిడిపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాస్ బుక్ జీరాక్స్, ఆధార్ కార్డు జీరాక్స్ లతో సంబందిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

## నర్సాపూర్‌లో ఘనంగా దీపావళి పండగ వేడుకలు

**నర్సాపూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** పట్టణంతోపాటు మండల పరిధిలోని గ్రామాలలో సోమవారం దీపావళి పండగ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు దీపావళి కాంతుల్లో చిన్నారుల ఉత్సాహంతో టపాకాయలు పేల్చగా, బాణా సంచాలు కాల్చారు. అంతేగాక భక్తి శ్రద్ధలతో ఘనంగా లక్ష్మీ దేవి పూజలు నిర్వహించారు. నర్సాపూర్ పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా సాయంత్రం దీపావళి పండుగను పురస్కరించుకొని వాణిజ్య వ్యాపార సముదాయలతో పాటు గృహాలలో లక్ష్మీ దేవి పూజలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా దీపావళి కాంతుల్లో పెద్దలు చిన్నారులు కలిసిమెలిసి టపాసులు కాలుస్తూ అంగరంగ వైభవంగా దీపావళి వేడుకలు ఘనంగా ఉత్సాహంతో ఉల్లాసంగా జరుపుకున్నారు.

## హనుమాన్ ఆలయంలో అమావాస్య అన్నదానం

**నర్సాపూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అమావాస్య అన్న సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి పేద పండితులు హరిప్రసాద్ శర్మ సూచనల మేరకు అన్న ప్రసాద దాతలు గ్లాండ్ ఫామ్ అల్లీపూర్ చెందిన ఏకే అనంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఆలయ ధర్మకర్త కుమ్మరి సంజీవ్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా శ్రీప్రసన్నాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం సింధూర లేపనం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాల తదనంతరం నైవేద్యాన్ని సమర్పించారు. ఈ మేరకు మధ్యాహ్నం అన్న సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వేద పండితులు హరిప్రసాద్ శర్మ, ఆలయ ధర్మకర్త కుమ్మరి సంజీవ్ తో పాటు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశదీప వ్రతం విజయవంతం చేయాలి

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 21 (ప్రభాతవార్త):** ఆకాశదీప వ్రతం విజయవంతం చేయాలని శేషం శ్రీనివాసచార్యులు అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు, ధూప దీప నైవేద్యం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బ్రాహ్మణ సేవా వాహిని సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శేషం శ్రీనివాసచార్యులు, యువ పురోహితులు ఉదయ్‌స్వామి మాట్లాడుతూ అందరికీ శ్రీగోదా పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కరుణా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ కార్తీకమాసం పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుండి నవంబరు 20వ తేదీ వరకు ఆకాశదీప వ్రతం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులుకావాలని అన్నారు. కార్తీక మాసంలో దీపారాధన మంచిదని, అందులో ఆకాశ దీపారాధన మరింత శ్రేష్టమని, ఆకాశ దీపారాధన చేస్తే ఆరోగ్య సమస్యలు ఉండవని, కోరిన కోరికలు నెరవేరుతాయని పురాణాలు చెబుతున్నాయని అన్నారు.


మాట్లాడుతున్న శేషం శ్రీనివాసచార్యులు


ఎస్సీ, ఎస్టీకమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళితసంఘాల నేతలు

## దళిత మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**ములుగు, అక్టోబరు 21 (ప్రభాతవార్త):** దళిత మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు దళిత సంఘాల నాయకులు హైద్రాబాద్‌లోని వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ ములుగు మండలం క్షీరసాగర్ గ్రామానికి చెందిన దళిత మహిళ తుర్కపల్లిలోని ఓ కంపెనీలో పనిచేస్తుండగా, ఇటీవల పని ముగించుకొని ఇంటికి వస్తున్న ఆమెను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కారులో లిఫ్ట్ ఇస్తానని ఎక్కించుకొని అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఎసిపికి ఫోన్‌చేసి ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎన్ని చట్టాలు ఉన్నా దళితులపై అఘాయిత్యాలు ఆగడంలేవని, దళితుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, దళిత సంఘాల నాయకులు పొన్నాల కుమార్, తుమ్మ శ్రీనివాస్, దాసరి ఏగొండస్వామి, చిప్పల యాదగిరి, రామచంద్రం పాల్గొన్నారు.

## కాళీమాతను దర్శించుకున్న ప్రజలు

**వెల్దుర్తి, అక్టోబరు 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎం జలాల్పూర్ గ్రామ శివారులో వెలిసిన కాళీమాత విగ్రహాన్ని దీపావళి పండగ సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు దర్శించ కాళీమాత విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కాళీమాతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులు దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయం ముస్త్యాల రోడ్డు

### డిసిఎం వెనుక చక్రాలు ఊడిపోయిన వైనం

### అర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యమే కారణమని వాహనదారుల ఆరోపణ

**చేర్యాల, అక్టోబరు 21,ప్రభాతవార్త**

మండలంలోని ముస్త్యాల గ్రామ శివారు ప్రగతి స్కూల్ ముందు ఉన్న జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక సంఘటన చోటుచేసుకుంటుంది. ఈ జాతీయ రహదారిపై గతంలో ఎందరో ప్రయాణికులు ప్రాణాలను పోగొట్టుకున్నారు. ఒకప్పుడు ఈ స్కూల్ ముందు రహదారి క్రాసింగ్‌గా ఉండటం వల్ల ప్రమాదాలు నిత్యం జరగడంతో రోడ్డును కొద్దిగా సీదా చేశారు. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్లన్ని దెబ్బతిని గుంతలుగా మారడంతో ప్రయాణికులకు ప్రమాదంగా మారింది. దీంతో ఆదివారం గుంతల్లో పడి డీసిఎం వెనుక చక్రాలు పూర్తిగా ఊడిపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనాదారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన జాతీయ రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి వాహనాదారులకు ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.


జాతీయ రహదారిపై డీసీఎం వెనుక చక్రవాలు ఊడిపోయిన దృశ్యం

# ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలి

### ఐసిటి వైస్ ఛాన్సలర్ ప్రొ. ఏబి పండిట్


పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

**నర్సాపూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే సౌరశక్తి వాయుశక్తి వంటి పునరుత్పత్తి శక్తులను వినియోగించి శక్తిని సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలని ప్రతి ఒక్కరూ పర్యావరణ ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలని ఐసిటి ముంబై వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏబి పండిట్ పేర్కొన్నారు మంగళవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి అస్త్ర 2025 ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిటి ముంబై వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏబి పండిట్ హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు భవిష్యత్తులో అద్భుతమైన అవకాశాలు ఉంటాయని ఆయన విద్యార్థులకు తెలిపారు అనంతరం శ్రీ విష్ణు విద్యా సంస్థల చైర్మన్ కేవీ విష్ణు రాజు మాట్లాడుతూ తరగతి గదిలో బోధనలకంటే ప్రాక్టికల్‌గా అభ్యసిస్తే తద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడం జరుగుతుందని ఈ కెమికల్ రంగంలో ప్రాక్టికల్ ఆధారిత ప్రాముఖ్యత ఉంటుందని ఆయన విద్యార్థులకు సూచించారు అదేవిధంగా జాతీయస్థాయి రియాక్ట్ ఓ కార్ పోటీలలో బి.వి.ఆర్.ఐ.టి కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విష్ణు విద్యా సంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ కళాశాల మేనేజర్ బాపిరాజు టిఎల్ఎన్ సురేష్ వివిధ విభాగధిపతులు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్

## బాధితుల తరపున పోరాడితే కేసులు నమోదు చేస్తారా?

### -బిఆర్ఎస్ నేత నామ రవికిరణ్

**జహీరాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త:** పట్టణంలోని ఐడిఎస్ఎంటి కాలనీ వాసులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడం ఏంటని మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ నేత నామ రవికిరణ్ ప్రశ్నించారు. మంగళవారం నామరవికిరణ్ మాట్లాడుతూ ఐడిఎస్ఎంటి కాలనీలో 1989లో ప్రభుత్వం 158 సర్వే నంబర్‌లో 110 ఎకరాల్లో 1250ప్లాట్లు ఏర్పాటు చేసి నిరుపేదలకు మున్సిపల్ వారు విక్రయించారని, ఇటీవల కాలనీలో ప్రభుత్వ నిధులు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారని, అయితే ఎవరో వచ్చి కాలనీలో తమకు చెందిన 10 ఎకరాల్లో నిర్మించిన అభివృద్ధి పనులను, ఇండ్లను, ప్లాట్లను, అభివృద్ధి పనులను ధ్వంసం చేస్తున్నా పట్టించుకోని అధికారులు, పోలీసులు అదేమిటని ప్రశ్నించిన తమపై కేసులు నమోదు చేయడం తగునా అని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటాలు ఆగవన్నారు. సమావేశంలో ఐడిఎస్ఎంటి కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సంబరంగా దీపావళి వేడుకలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో దీపావళి పండగను సోమవారం ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఉదయం హారతులు తీసుకున్న అనంతరం లక్ష్మీపూజలు చేశారు. సాయంత్రం వేళ బాణాసంచాలు, టపాసులు పేల్చి పండగను సంబరంగా జరుపుకున్నారు. పండగ రోజు కొత్త బట్టలు ధరించారు. చిన్నా పెద్ద సంబరాలు వేడుకగా జరుపుకున్నారు. పండగ సందర్భంగా టపాసుల దుకాణాలు కిటకిటలాడాయి. టపాసులు పేల్చేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముందుగానే ప్రచారం చేశారు. దీపావళి పండుగ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలడాయి.

### చిన్నశంకరంపేట మండలంలో....

**చిన్నశంకరంపేట, అక్టోబరు 21,ప్రభాతవార్త:**

దీపావళి పర్వదినాన్ని మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం లక్ష్మీదేవికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఉదయం వాకిళ్ల ముందు అందమైన ముగ్గులు వేశారు. ప్రమిదలు వెలిగించి రంగు రంగుల క్రాకర్లు, పటాకులు కాల్చి సందడి చేశారు. పట్టణంలో బాణాసంచా విక్రయాలు భారిగా జరిగాయి. టపాసుల విక్రయ కేంద్రాలు కొనుగోలు దారులతో కిటకిటలా డాయి. ఆనందోత్సహాల మధ్య దీపాలను వెలిగించి దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**కొమురవెల్లి, అక్టోబర్ 21, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన యాదమ్మ మృతి చెందడంతో బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబీకులకు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అపదలో ఉన్న ప్రతి పేద కుటుంబానికి బిఆర్ఆర్ ఫౌండేషన్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

## పులిహోర పంపిణీ

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 21 (ప్రభాతవార్త):** పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం ప్రముఖ వ్యాపారవేత్త దూబకుంట ప్రభాకర్ స్వరూపరాణి దంపతుల ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాచారం ఆలయ మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, దూబకుంట మైత్రాములు, లక్ష్మణ్, గందె ప్రశాంత్, వెంకటేశం, కైలాస ప్రశాంత్, మల్యాల భద్రయ్య, కాశీనాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో అన్నదానం

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 21 (ప్రభాతవార్త):** పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద మంగళవారం ప్రముఖ వ్యాపారవేత్తలు కొత్త గోవర్ధన్, కొత్త శ్యామ్‌సుందర్ కుటుంబసభ్యుల సౌజన్యంతో అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, గజ్వేల్ మాజీ ఉపసర్పంచ్ నంగునూరి సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ అమావాస్య రోజు అన్నదానం చేస్తే పితృదేవతలకు మోక్షం కలుగుతుందని గజ్వేల్‌లో 67 నెలలుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిద్ధి బిక్షపతి, మల్యాల భద్రయ్య, అయిత సత్యనారాయణ, కైలాస ప్రశాంత్, దొంతుల సత్యనారాయణ, రుక్మయ్య, కాశీనాథ్, డాక్టర్ ప్రేమ్, హరి, రాజు, సిరిపురం సత్యనారాయణ, సంతోష్ పాల్గొన్నారు.

## రామకోటి ఆధ్వర్యంలో దీపావళి పూజలు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 21 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీదేవి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ లక్ష్మీదేవి సంపద, వైభవం, ఆనందానికి మూలమని అన్నారు. దీపావళి రోజున లక్ష్మీదేవి భూమిని దర్శించడానికి వస్తుందని పురాణాలు చెబుతున్నాయని, అందుకే దీపావళి రోజున లక్ష్మీదేవికి స్వాగతం పలుకుతూ ఇంటిని శుభ్రపరిచి పూలతో, దీపాలతో అలంకరిస్తామన్నారు. అమావాస్య చీకటి రాత్రి ఆ వెలుగులతో ప్రకాశవంతమవుతుందన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేయాలి

**కొండపాక, అక్టోబరు 21, ప్రభాతవార్త :** గురుకుల విద్యార్థులకు యూనిఫామ్స్, షూస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే అందించాలని టిజిపిఎ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల నర్సింలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అయన దుద్దెడలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు విద్య సంవత్సరం మొదలై 5 నెలలు గడిచిపోతున్న ఇప్పటి వరకు యూనిపామ్స్ అందించకపోవడం విచారకరమన్నారు. గతంలో ఏడాదికి రెండు జతల యూనిఫామ్స్ ప్రభుత్వం అందించేదన్నారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఒక్క డ్రెస్‌ను ఇవ్వకపోవడం సరికాదన్నారు. విద్యార్థులకు యూనిపామ్స్, కాస్మోటిక్స్, ఘూస్ అందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి వాటిని అందజేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇదేవిధంగా నిర్లక్ష్యం ధోరణితో వ్యవహరిస్తే విద్యార్థుల తల్లిదండ్రులతోకలిసి అందోళన చేపడతమని హెచ్చరించారు.

## మున్సిపల్ కార్మికులకు, సిబ్బందికి దుస్తులు పంపిణీ

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 21, ప్రభాతవార్త :**

సిద్దిపేట పట్టణాన్ని చెత్త, చెదారం లేకుండా అందంగా తీర్చిదిద్దడానికి ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా మున్సిపల్ కార్మికులు ప్రతి నిత్యం శ్రమిస్తారని 42వ వార్డు కౌన్సిలర్ కాటం శోభరాఘురామ్ అన్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా 42వ వార్డు మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు స్పైస్ స్కూల్ హెచ్ఎం శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన వస్త్రాలను పంపిణీ చేసి మాట్లా డారు. మున్సిపల్ కార్మికుల, సిబ్బంది జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. మున్సిపల్ కార్మికుల, సిబ్బంది సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. 42వ వార్డును ప్రతి నిత్యం అందంగా తీర్చిదిద్దడానికి కార్మికులు, సిబ్బంది చేస్తున్న కృషి ఎంతో ఉందన్నారు.



మున్సిపల్ సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

## సదాశివపేటలో కోటిరూపాయల టపాసుల అమ్మకాలు



సదాశివపేటలో వెలిసిన టపాసుల దుకాణాలు

**సదాశివపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
సదాశివపేటలో గత మూడురోజుల నుండి దీపావళి సంబరాలలో సుమారుగా కోటిరూపాయల టపాసుల వ్యాపారం అంచనా. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రత్యేకషాపులతోపాటు పట్టణంలో కూడా అక్కడక్కడ చిన్న టపాసుల అమ్మకాలు జరిపారు. టపాసుల ధరలు గత సంవత్సరం కంటే అధికంగా ఉన్నప్పటికీ ప్రజలు యథావిధిగానే కొనుగోలుచేశారు. సోమవారం ఉదయం అల్పపీడన ప్రభావం కనిపించడంతో వ్యాపారస్తులు కొంత గాభరాపడ్డారు. వర్షంవస్తే అమ్మకాలు ఆగిపోతాయని అప్పుడు తమ పరిస్థితి ఏమిటని ఆందోళనచెందారు. ఫైర్‌సేఫ్టీ గురించి అధికారులు సూచనలను పట్టణంలో రోడ్లపై వెలిసిన టపాసుల అమ్మకాలవద్ద ఎలాంటి ఫైర్‌సేఫ్టీలేకున్నా, అధికారులు గమనించడంలేదు. మొత్తానికి దీపావళికి టపాసుల రూపంలో భారీగానే వెచ్చించారు.

## కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన



అల్లాదుర్గంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ రాజేష్

**అల్లాదుర్గం, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో పత్తిపంటను సాగు చేసుకుంటున్న రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై మండల వ్యవసాయ అధికారి రాజేష్ మంగళవారం అవగాహన కల్పించారు. పత్తిపంటను పండించిన రైతులు పత్తిని అమ్ముకునేందుకు కపాస్‌కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కపాస్ కిసాన్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేతీరు, స్లాట్ బుక్‌చేసుకునే విధానంపై రాజేష్ రైతులకు అవగాహన కల్పించారు. దళారుల దోపిడీ నుంచి రైతులను కాపాడుకునేందుకు యాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. రైతులు పత్తి మిల్లుల వద్ద వేచిచూడాల్సిన దుస్థితి దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విశాలరావు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ వార్డు విభజనపై కమిషనర్‌కి వినతిపత్రం అందించిన రాళ్లకత్వ గ్రామస్తులు

**-సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్**



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

**జిన్నారం, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపల్‌పరిధిలోని రాళ్లకత్వ గ్రామాన్ని వార్డు విభజనపై ప్రజల్లో ఆందోళన మున్సిపల్ పరిధిలో కొత్తగా చేపట్టిన వార్డుల విభజనపై స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు వార్డుల పునర్విభజనలో అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ రాళ్లకత్వ స్థానిక నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. వార్డులో సరిహద్దులు సరిగ్గా నిర్ణయించకపోవడంతో పాత కాలనీలు, గ్రామాలు విభిన్నవార్డులుగా విడిపోయాయని వారు పేర్కొన్నారు. దీనివల్ల ప్రజల సౌకర్యాలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ప్రజల సూచనలు తీసుకుని సరైనమార్పులు చేయాలని స్థానిక నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతికి రాళ్లకత్వ గ్రామస్థులు వార్డు విభజన తమ డిమాండ్లను వారికి వివరించారు. దీనిపై మున్సిపల్‌కమిషనర్ స్పందించి త్వరలోనే విభజనపై స్పష్టమైన మార్పులు చేర్పులుచేసి పై అధికారులకు పంపిస్తానని గ్రామస్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌సిబ్బంది, మున్సిపల్‌కమిషనర్ రాళ్లకత్వ గ్రామస్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిన్నారం మున్సిపల్‌కమిషనర్ సానుకూలంగా స్పందించారు. రాళ్లకత్వ గ్రామప్రజలు కమిషనర్ తిరుపతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అత్యధిక గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన శివాలి

**-ఇప్పటివరకు 21 గిన్నిస్ రికార్డులతో మరో రికార్డు**

**పటాన్‌చెరు, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిని శివాలి జోహ్రి శ్రీవాస్తవ (స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, 20162020 బ్యాచ్ సీఎస్ఈ), ఆమె తల్లిదండ్రులు కవితాజోహ్రి శ్రీవాస్తవతోకలిసి ప్రపంచంలోనే అతిపెద్ద ఓరిగామి ప్రదర్శన చేసి రెండు సరికొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించారు. ఈ తాజా విజయంతో, శివాలి మొత్తం 21 గిన్నిస్ వరల్డ్ రికార్డులకు చేరుకుని, మనదేశంలో అత్యధిక సంఖ్యలో గిన్నిస్ రికార్డులు కలిగి ఉన్న వ్యక్తిగా ఆమె నిలిచింది. గతంలో శివాలి 19 గిన్నిస్ రికార్డులు సాధించిన విషయం విదితమే. వాటిలో 1,251 చేతితో తయారు చేసిన కాగితపు బొమ్మలు, 7,011 క్విల్డ్ పువ్వులు, 2,111 పేపర్ క్విల్డ్ బొమ్మలు, 3,501 ఓరిగామి తిమింగలాలు, 2,100 పెంగ్విన్లు, 6,132 సిట్రస్ పండ్లు, 6,001 తిమింగలాలు, 2,500 పెంగ్విన్లు, 1,993 మాపుల్ ఆకులు, 6,500 గబ్బిలాలు, 5,500 కార్లు, 3,400 డైనోసార్లు, 1,900 కుక్కలు, 3,400 నెమళ్ళు, 3,200 పందులు, 4,400 చొక్కాలు, 2,200 క్విల్డ్ బొమ్మలు, 3,200 సీల్స్, 3,400 రిబ్బన్ టైలు ఉన్నాయి. ఇవేగాక, 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులు, నాలుగు యూనిక్ వరల్డ్ రికార్డులను కూడా శివాలి సాధించి, తన అసమానమైన సృజనాత్మకత, పట్టుదల, కళల పట్ల మక్కువను ప్రదర్శిస్తోంది. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికాఫిలిప్, గణితశాస్త్ర ఆచార్యుడు డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు శివాలి అసాధారణ విజయాలను ప్రశంసించి, అభినందనలు తెలియజేశారు.

## టిపిసిసి చీఫ్‌కు శుభాకాంక్షలు తెలిపిన గాలి అనిల్‌కుమార్

**అమీన్‌పూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
టిపిసిసి ఉపాధ్యక్షులు గాలి అనిల్‌కుమార్ నార్సింగిలో టిపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాలి అనిల్‌కుమార్ బొమ్మ మహేష్‌కి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్స్ అందజేశారు. గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ దీపావళి తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, అభివృద్ధి ఆనందంతో నిండిన సంవత్సరం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను గాలి అనిల్‌కుమార్ అన్నారు. ఆయన సందర్శన ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లలో మోసం

**-పత్తి రైతులు దళారుల చేతిలో మోసపోవొద్దు**
**-మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర కోశాధికారి జైపాల్**



మాట్లాడుతున్న మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర కోశాధికారి జైపాల్

**కొండాపూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
జిన్నింగ్ మిల్లులు దళారుల కాంటలపై అధికారులు తనిఖీలు జరిపాలని పత్తి రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర కోశాధికారి జైపాల్ అన్నారు. మండలంలో అనంతసాగర్ సెంటర్‌లో మంగళవారం పత్తి పంట అమ్మకాలపై రైతు సంఘాలతో సిసిఐ సమావేశాలు ఏర్పాటుచేసి రైతలకు పత్తిపంట అమ్మకాలపై అవగాహన కల్పించారు. పత్తి పంటను దళారులకు అమ్మి రైతులు మోసపోతున్నారని పత్తి కొనుగోలు చేసే జిన్నింగ్ మిల్లుల్లో తూకంలో మోసాలు చేస్తూ తేమ శాతం పేరుతో రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో దళారులు ఎంటర్ కాకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర కోశాధికారి డి.జైపాల్ డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లు సులువుగా జరిగేలా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిసాన్ కాపాస్ యాప్‌లో సాంకేతిక ఇబ్బందులురాకుండా కొనుగోలు సజావుగాసాగేలా చూడాలన్నారు. సిసిఐ కొనుగోళ్లలోను కొందరు దళారులు అధికారులతో కుమ్మక్కై తక్కువధరకే పత్తిని కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో రైతులు వహీద్, వెంకట్‌రెడ్డి, బుచ్చయ్య, ఇసుబు, శ్రీశైలం, శంకర్‌లున్నారు.

## కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శానిటేషన్ అధికారులు

**-రోజు పనిచేస్తేగాని పూటగడవని పారిశుధ్య కార్మికుల బతుకులు**



భద్రత లేకుండా రోడ్డుపై పనిచేస్తున్న పారుశుధ్య కార్మికులు

**సదాశివపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
రోజు పనిచేస్తేగాని పూటగడవని పారిశుధ్య కార్మికుల బతుకులు దీనంగా మారాయి. సదాశివపేటలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ప్రాణాలతో శానిటేషన్ అధికారులు చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వారి బతుకులు అగమ్యగోచరంగా మారాయి. ఈ క్రమంలో ప్రధాన జాతీయ రహదారిపై పారిశుధ్య నిర్వహణకుగాను ఏడు సంవత్సరముల క్రితం పురపాలకసంఘంనుండి స్వీపింగ్‌మిషన్ వాహనాన్ని సుమారు రూ.40లక్షలకు పైగా ఖర్చుచేసి కొనుగోలు చేసినప్పటికీ, అది ఇప్పటివరకు కనీసం వందరోజులు కూడా పనిచేయలేదు. కాని దాని నిర్వహణ రిపేరింగ్‌కు మాత్రం లక్షల రూపాయల బిల్లులు చెల్లించారు. ప్రస్తుతం ఇప్పుడు ఐదు సంవత్సరాలుగా రోడ్డుపైకి రాలేక మూలనపడి ఉంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోటానుకోట్ల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చుచేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇకనైనా ప్రజాధనాన్ని ప్రజల కోసం చేసే మంచి పనులకు ఉపయోగించాలని ప్రజలు కోరుతున్నారు.

## పొలాన్ని కలియదున్నితేనే పంటలకు మేలు



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి శ్వేతాకుమారి

**కొల్చారం, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
పొలాన్ని కలియదున్నితేనే పంటలకు మేలుకలుగుతుందని మండల వ్యవసాయాధికారిణి శ్వేతాకుమారి అన్నారు. మండల పరిధిలోని రంగంపేటలోని సొసైటీ ఆవరణలో రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గతంలో వరిపంటలను కొడవళ్లతో మొదళ్లదాకా కోసేవారు, రైతులకు పశువులు ఎక్కువగా ఉండటంతో గడ్డిని కుప్పలుకుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు, అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారని, హార్వెస్టర్ మిషన్‌తో వరిపంటను కోసే సమయంలో పైకికోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయన్నారు. అవసరమున్న రైతులు గడ్డిని తీసుకెళ్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలను తగలబెడుతున్నారు. దీనివల్ల అధికనష్టాలు వచ్చే అవకాశముంది, ఎట్టి పరిస్థితుల్లోనూ వరి కొయ్యలను తగులబెట్టొద్దన్నారు. వరికొయ్యలను కాల్చితే నష్టమే తప్ప, ఎలాంటి ప్రయోజనం ఉండదు. కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమిసారాన్ని కోల్పోతుందన్నారు. వరి కొయ్యలను తగులబెట్టడం ద్వారా గాలి, నేల కలుషితమౌతున్నాయన్నారు. దీంతో పంటలకు మేలు చేసే పురుగులు మరణిస్తాయన్నారు. వరికొయ్యలను కలియ దున్నితేనే సేంద్రియ ఎరువుగా మారుతుందన్నారు. కొయ్యలు ఎరువుగా మారడంతో దిగుబడి అధికంగా పెరుగుతుందన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలి

**-ఆర్డీఓ రమాదేవి**



జిపివోలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
రెవెన్యు ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి సూచించారు. మంగళవారం ఆమె పాపన్నపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. సందర్భంగా ఇటీవల నియామకమైన ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగులతో కలసి మాట్లాడుతు ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలని చెప్పారు. కార్యాలయానికి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కొత్తగా చేరిన 10 మంది జిపిఓలకు వారి విధుల పట్ల అవగాహన కల్పించారు. రికార్డులు పరిశిలించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సతీష్‌కుమార్, ఆర్బిలు ఇంతి, నాగరాజు సిబ్బంది ఉన్నారు.

## రైతులకు రాయితీపై శనగవిత్తనాల పంపిణీ



రైతులకు రాయితీపై శనగ విత్తనాలు అందచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**న్యాల్‌కల్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని రైతు వేదికలో మంగళవారం జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగా రైతులకు శనగ, కుసుమ విత్తనాలను రాయితీపై వ్యవసాయ అధికారులు మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణి చేశారు. 350 బస్తాల శనగ విత్తనాలను 25కిలోల బస్తాను 1500 రూపాయలకు అందచేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి, మాజీ ఎంపిపి ఉపాధ్యక్షులు గౌసొద్దిన్, ఏఈఓ ఈనా రాథోడ్, రైతులు పాల్గొన్నారు.

## సిఐటియు రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లు విడుదల

**చిలిపిచెడ్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
మెదక్‌లో జరిగే సిఐటియు 5వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మెదక్ జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ అన్నారు. మంగళవారం చిలిపిచెడ్ మండలకేంద్రంలో సిఐటియు రాష్ట్ర 5వ మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్మికుల సమస్యలను చర్చించడానికి డిసెంబర్ 7,8,9 తేదీలలో మెదక్ పట్టణంలో జరిగే సిఐటియు 5వ రాష్ట్రమహాసభలను నిర్వహించడం జరుగుతుందని, మొదటిరోజు 7వ తేదీన బహిరంగ సభ, 8,9 తేదీలలో రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈమహాసభలలో కార్మికులు, కర్షకులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మెదక్‌జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## పెంటప్పకు నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు



పెంటప్ప చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**న్యాల్‌కల్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
అనారోగ్యంతో తిరిగిరాని లోకాలకు చేరిపోయిన మండల పరిధిలోని చాల్కి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గ్రామ మాజీ సర్పంచ్ రాజేశ్ తండ్రి బట్ట పెంటప్ప చిత్రపటానికి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం పెంటప్ప స్వగృహంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి రేజింతల్, మండల కో-ఆర్డినేటర్ న్యామతాబాద్ రంజిత్, చాల్కి గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మున్ను పటేల్, నాయకులు రియాజుద్దీన్, గుణవంత్ పటేల్, సంతోష్, సాల్మన్, అఖిల్ తదితరులు ఉన్నారు.

## కబడ్డీ పోటీల్లో పాపన్నపేట విద్యార్థి ప్రతిభ




పిడి రమేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్ 14 కబడ్డీపోటీల్లో మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నతపాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచారు, ఈనెల 16 నుండి 18 వరకు పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ అండర్ 14 కబడ్డీ పోటీలు నిర్వహించారు. అందులో ఉమ్మడి పది జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా ఉమ్మడి మెదక్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో పాపన్నపేట విద్యార్థి ఎస్ నరసింహులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా నరసింహులును పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా విజయానికి కృషిచేసిన పాపన్నపేట పిడి రమేష్‌ను ప్రధాన ఉపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు.

## ఇద్దరు కుమారులతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

**-గ్రామస్థుల సమాచారంతో కాపాడిన పోలీసులు**

**జహీరాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఆ ఇల్లాలు తన ఇద్దరు పిల్లలతో కలిసి కొత్తూర్ గ్రామశివారులోని నారింజ ప్రాజెక్టులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న తరుణంలో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని తల్లి, ఇద్దరు కుమారులను కాపాడిన సంఘటనకు సంబంధించి ఎస్ఐ ఎం కాశీనాథ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం బూర్దిపాడ్ గ్రామానికి చెందిన అమలాపురం నాగమణి తన భర్త సంతోష్‌రెడ్డితో ఏర్పడిన కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తిచెంది ఇద్దరు కుమారులతో కలిసి నారింజలోదూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను కాపాడారు. పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
నేడు బుధవారం 22.10.2025తేదీన రామాయంపేట మున్సిపాలిటీతోపాటు పలుప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, అందుకు ప్రజలు సహకరించాలని ఏడిఈ ఆదయ్య ఏఈ తిరుపతిరెడ్డిలు తెలిపారు. 33/11కెవి రామాయంపేట సబ్‌స్టేషన్‌లో నూతన విద్యుత్‌పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు జరుగుతుందని, అందువలన ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 4గంటలవరకు రామాయంపేట సబ్‌స్టేషన్‌పరిధిలోని దామరచెరువు, వెంకటాపూర్, రామాయంపేట ఏజిఎల్, రామాయంపేట టౌన్ 2, రామాయంపేట టౌన్ 1, టౌన్‌మొత్తం విద్యుత్తులో అంతరాయం ఉంటుందన్నారు. కావున ఆయా గ్రామాలప్రజలు, సంబంధిత రైతులు టిజి ఎస్పిడిసిఎల్ డిపార్ట్మెంట్‌కి సహకరించగలరని ఏడిఈ ఆదయ్య, ఏఈ తిరుపతిరెడ్డిలు కోరారు.

## మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసిన వారిపై కేసులు

**జహీరాబాద్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
ఈ నెల 16న మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి కార్యాలయాన్ని ముట్టడించిన ఐడిఎస్ఎంటి కాలనీవాసులను మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నామ రవికిరణ్‌తోపాటు ఐడిఎస్ఎంటి కాలనీవాసులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# అమరుల త్యాగాలు వెలకట్టలేనివి...



అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



సిర్గాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కంగ్టిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చిలిపిచెడ్‌లో నివాళి అర్పిస్తున్న పోలీసులు

**పాపన్నపేటలో...**

**పాపన్నపేట, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణదినాన్ని పురస్కరించుకొని పోలీస్‌స్టేషన్లో అమరవీరులస్థూపానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...1999 సెప్టెంబర్13న పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌ను మావోయిస్టులు పేల్చివేయడం చాలా బాధాకరమన్నారు. ఈ ఘటనలో అమరులైన పోలీసులు హెడ్‌కానిస్టేబుల్ రఘునందన్, కానిస్టేబుళ్లు అబేద్ హుస్సేన్, రాంచందర్, ప్రసాద్, నర్సింలు చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఏఎస్సై తుక్కయ్య, కానిస్టేబుళ్లు బస్వరాజ్, శివకుమార్, నర్సింలు, వెంకటేష్, యాదగిరి, నాగలక్ష్మీ ్మ, తదితరు లున్నారు.

**సిర్గాపూర్‌లో...**

**సిర్గాపూర్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సంస్మరణర్యాలీ నిర్వహించారు. అమరులైన పోలీసులకు నివాళులు అర్పించారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులతోకలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్, ఎస్ఐ మహేష్, పోలీసులు, ఉపాధ్యాయులు మధుకర్‌రెడ్డి, నాగభూషణం, రాంచందర్, వరప్రకాష్, శ్రీరామ్, లక్ష్మి, అన్సారీ, విద్యార్థులు పాల్గొన్నారు.

**నాగల్‌గిద్దలో...**

**నాగల్‌గిద్ద, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలకేంద్రమైన నాగల్‌గిద్దలో అమరవీరుల సంస్మరణదినోత్సవాన్ని జరుపుకున్నారు. అమరులైన పోలీసులకు నివాళులు అర్పించారు.

**కంగ్టిలో....**

**కంగ్టి, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
కంగ్టిలో పోలీసుల అమరవీరుల దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో అమరవీరులకు ఎస్సై దుర్గారెడ్డి, ఏఎస్ఐ రవీందర్‌గౌడ్, సిబ్బంది ఘననివాళి అర్పించారు. అనంతరం స్థానికపాఠశాల విద్యార్థులతోకలిసి సుభాష్ చందబోస్ కూడలినుండి బసవేశ్వరచౌక్ వరకు అదే విధంగా దెగుల్‌వాడి రోడ్డు మజీద్ వరకు పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. జై జవాన్ జై కిసాన్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అలాగే గ్రామయువత ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజలు సంతోష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకువలు సంతోషరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుభాష్ అలాగే పోలీస్‌లు పాల్గొన్నారు.

**చిలిపిచెడ్‌లో...**

**చిలిపిచెడ్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**
పోలీసు అమరవీరుల త్యాగాలు మరువబోమని చిలిపిచెడ్ ఏఎస్ఐ రాములు పేర్కొన్నారు. మంగళవారం పోలీసు అమరవీరులసంస్మరణదినం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధినిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాములు, హెడ్‌కానిస్టేబుల్ నర్సింలు, ఎలియాస్ రెడ్డి, సిబ్బంది చెన్నుస్వామి, దేవీసింగ్, సతీష్, దుర్గాప్రసాద్, సాయి, జాన్ పాల్గొన్నారు.